సాక్షి కామారెడ్డి

శనివారం । 25 । నవంబర్ । 2023



కామారెడ్డిలో బాహాబాహీ

కామారెడ్డి జిల్లాకేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బాహాబాహీకి దిగారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించారు.

- 8లో ▸



చేతికి చిక్కుతున్నారు

పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ గూటికి చేరుతుండడంతో బీఆర్ఎస్ నష్ట నివారణ చర్యలు చేపట్టింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /19.1

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు భిక్కనూరుకు మంత్రి కేటీఆర్ రాక



భిక్కనూరు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం భిక్కనూరులో పర్యటించనున్నారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో హెలీపాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఉదయం 11 గంటలకు భిక్కనూరుకు చేరుకుని రోడ్‌షోలో పాల్గొంటారన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిర్మల్‌రెడ్డి, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, సింగిల్‌విండో చైర్మన్‌లు గంగళ్ల భూమయ్య, రాజాగౌడ్, నాగర్తి భూంరెడ్డి, నేతలు కిష్టాగౌడ్, మహేందర్‌రెడ్డి, రాంచంద్రం, భూపతి తదితరులున్నారు.

నేడు బోధన్‌కు రాహుల్‌గాంధీ



బోధన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బోధన్ శివారులోని నర్సాపూర్ క్రాసింగ్ వద్ద విజయభేరి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. శుక్రవారం మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సభా ఏర్పాట్లను పరిశీలించారు. పాషామోహినోద్దీన్, తూము శరత్ రెడ్డి, మహ్మద్ గౌసోద్దీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతుబంధు జమ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రైతుబంధును కొనసాగించేలా సీఎం కేసీఆర్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయడం.. ఈసీ సానుకూలంగా స్పందించడంపై మంత్రి ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సాకు చూపి రైతుబంధు ఆపాలని చూసిన ప్రతిపక్షాలకు ఇదో గుణపాఠమని పేర్కొన్నారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు పైసలు శనివారం నుంచి రైతుల ఖాతాల్లో చేరుతాయని, రైతులు పంటలకు పెట్టుబడిగా వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.



మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, వేదికపై ఎంపీ అర్వింద్, బీజేపీ అభ్యర్థులు, నేతలు

కేసీఆర్ శకం ముగిసింది

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజల మనిషి మంత్రి కాలేడు
- బీడీ కార్మికుల కోసం 500 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం
- ముస్లిం రిజర్వేషన్లను తొలగించి ఓబీసీ, ఎస్సీలకు కేటాయిస్తాం
- ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల సకల జనుల సంకల్ప సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

ఆర్మూర్: అవినీతిమయమైన సీఎం కేసీఆర్ శకం ఇక ముగిసిపోయిందని.. ప్రపంచంలో దేశాన్ని మొదటి స్థానంలో నిలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన ఇక తెలంగాణ రాష్ట్రంలో రాబోతోందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్ శివారులో శుక్రవారం నిర్వహించిన ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల సకల జనుల సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో డబ్బులు ఇచ్చే వారే మంత్రులు అవుతారు కానీ ప్రజల మనిషి మంత్రి కాలేడన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఆరోపించారు. ప్రధాని మోదీ పెట్రోల్, డీజిల్‌పై కస్టమ్ డ్యూటీ తక్కువ చేసినా.. కేసీఆర్ జీఎస్టీ తగ్గించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే జీఎస్టీ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు కేటాయించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించి ఓబీసీ, ఎస్సీలకు అవకాశం కల్పిస్తామన్నారు. రజాకారుల భయంతో కేసీఆర్ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చాక అధికారికంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడిన వారిని జైళ్లలో పెడతామన్నారు. జిల్లాలోని బీడీ కార్మికులకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి 500 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్మూర్ ఆర్టీసీ బస్ డిపోకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసుకొని షాపింగ్ మాల్ కట్టిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించిందంటే దీని వెనక అవినీతి ఒప్పందాలు ఉండి ఉంటాయని పేర్కొన్నారు.



అమిత్ షాతో ముచ్చటిస్తున్న ఎంపీ అర్వింద్

బోర్డుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని కేంద్ర హోంమంత్రి పేర్కొన్నారు. దీంతో పసుపు ఎగుమతులు పెరిగి గిట్టుబాటు ధర పెరుగుతుందన్నారు. పసుపుతో మెడిసిన్ తయారు చేసే పరిశోధనలు సైతం తాము ప్రారంభిస్తామన్నారు.

గల్ఫ్ బాధితుల కోసం ఎన్ఆర్ఐ సెల్..

తెలంగాణ రాష్ట్రం నుంచి లక్షల మంది యువత ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారని అమిత్‌షా పేర్కొన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రత్యేకంగా ఎన్ఆర్ఐ సెల్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సభలో బీజేపీ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, లోక భూపతిరెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, బస్వా లక్ష్మీనర్సయ్య, పల్లె గంగారెడ్డి, కంచెట్టి గంగాధర్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బాయిల్డ్ రైస్ కొనుగోలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేయని బాయిల్డ్ రైస్‌ను బీజేపీ ప్రభుత్వం గిట్టుబాటు ధరకే కొనుగోలు చేస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.3,100 చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి చెల్లించాల్సిన ప్రీమియాన్ని రైతులు చెల్లించాల్సిన అవసరం లేదని, బీజేపీ ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. మహిళలకు ఏడాదికి నాలుగు సిలిండర్లను ఉచితంగా అందజేస్తామన్నారు.

ఇందూరు నుంచే మార్పునకు నాంది



తెలంగాణ రాష్ట్రానికి అన్నం పెట్టడమే కాదు రాష్ట్రంలో మార్పునకు నాంది పలికే జిల్లా నిజామాబాద్ అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. రైతు బంధు ఇస్తున్నామనే కారణం చెపుతూ డ్రిప్ ఇరిగేషన్, ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా రైతులను సీఎం కేసీఆర్ తీవ్రంగా నష్టాల పాలు చేస్తున్నాడని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే విద్య, వైద్య రంగాల్లో నాణ్యమైన సేవలను అందిస్తామన్నారు. గజ్వేల్, కామారెడ్డిల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు.

కాంగ్రెస్‌లో 33మంది కేసీఆర్ మనుషులే..

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థుల్లో 33 మంది సీఎం కేసీఆర్ మనుషులేనని ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. కేసీఆర్‌కు కోవర్టులుగా పని చేస్తూ వీరు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీలో నిలిచారన్నారు. అందువల్ల బీఆర్ఎస్ వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు వేసి వృథా చేయకుండా బీజేపీకి వేయాలని కోరారు.



సభలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

జాజాల గరీబోళ్ల బిడ్డ

- ఏ కష్టమొచ్చినా అండగా ఉంటడు
- అభివృద్ధి చేసేవాళ్లనే ఆదరించండి
- ఎల్లారెడ్డి, లింగంపేట రోడ్‌షోలలో వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావును గజమాలతో సత్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేదోళ్ల బిడ్డ అని, ఆయన దగ్గర డబ్బులు లేవు కానీ ప్రజలకు ఎలాంటి కష్టమొచ్చినా కాపాడే మంచి గుణం మాత్రం ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రోడ్‌షోలు నిర్వహించారు. ముందుగా హెలీపాడ్ వద్ద ఆయనకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్వాగతం పలికారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఎల్లారెడ్డి పట్టణం, లింగంపేట మండల కేంద్రాలలో రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వైద్య సేవల కోసం ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి నా వెంట పడి ఎల్లారెడ్డికి 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయించుకున్నాడన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, విశాలమైన కొత్త బస్టాండ్ ప్రాంగణం, పెద్ద చెరువుపై బ్రిడ్జిని మంజూరు చేయించి ప్రజలకు మేలు చేశారన్నారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలిస్తామన్నారు. కాయితీ లంబాడీల సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెరిగాయని, రైతులు రెండు పంటలు పండిస్తూ సుఖంగా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంటు ఉంటే వార్తయ్యేదని, ఇప్పుడు కరెంటు పోతే వార్తవుతోందని పేర్కొన్నారు. 24 గంటల కరెంటిచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో, మూడు గంటల కరెంటు అంటున్న కాంగ్రెస్ కావాలో ఆలోచించాలన్నారు.

ప్రతి రైతుకు రూ. 15 వేలే ఇస్తారట..

తమ ప్రభుత్వం ప్రతి ఎకరాకు ఏటా 10 వేల రైతుబంధు ఇస్తోందని, దీనిని రూ. 16 వేలకు పెంచుతామని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్సోళ్లు మాత్రం ప్రతి రైతుకు ఏడాదికి రూ. 15 వేలే ఇస్తామంటున్నారన్నారు. అంటే ఎన్ని ఎకరాలున్నా రూ. 15 వేలే వస్తాయన్నారు. ఐదు గ్యారంటీల పేరుతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కర్ణాటకలో ఊదరగొట్టారన్నారు. కానీ అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 9 గంటల కరెంటు 4 గంటలకు వచ్చిందన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు కోత పెడుతున్నారన్నారు. అక్కడ రూ. 4 వేల రైతుబంధు ఉంటే గ్యారంటీల్లో ఆ పథకం లేదంటూ ఎత్తేశారని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.



ఎల్లారెడ్డి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సురేందర్

ఆత్మ గౌరవానికే ఓటేయండి..

అమెరికా నుంచి డబ్బు సంచులతో వచ్చి సంతలో పశువులను కొంటున్నట్లు నాయకులను కొనేటోడు మనకొద్దని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ఎన్నికలు ఎల్లారెడ్డి ఆత్మగౌరవానికి పరీక్ష అని, ఇందులో ప్రజలు గెలవాలి కాని నోట్ల కట్టలు కాదని పేర్కొన్నారు. గతంలో ఎంపీ బీబీ పాటిల్ చేతిలో రెండుసార్లు ఓడిపోయిన వ్యక్తి ఈ ఎన్నికలలో సురేందర్ చేతిలోనూ ఓడిపోవడం ఖాయమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఆదుకునే సురేందర్‌నే గెలిపించాలని కోరారు. ఎల్లారెడ్డి, కామారెడ్డిలను హైదరాబాద్–సికింద్రాబాద్‌లలాగా తీర్చిదిద్దాలన్న కృత నిశ్చయంతో కేసీఆర్ ఉన్నారన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ప్రత్యేక కోటాలో 10 వేల ఇళ్లను మంజూరు చేయించే బాధ్యత తనదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇక్కడి నాయకులను సంతలో గొర్రెలు, మేకలు కొన్నట్లు కొంటున్నాడని జాజాల సురేందర్ ఆరోపించారు. ఆయన నాయకులను కొనగలడేమో కానీ వివేకవంతులైన ఎల్లారెడ్డి ఓటర్లను కొనలేడన్నారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమాలలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంపత్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సర్పంచ్ లావణ్య, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రమేశ్, దేవేందర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, ముదాం సాయిలు, నహీం, నరహరి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కామారెడ్డికి ప్రధాని రాక



- జిల్లా కేంద్రంలో బీజేపీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్న మోదీ
- భారీ జన సమీకరణపై దృష్టి సారించిన కమలదళం

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ చేస్తున్నారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డిల గెలుపు కోసం వారి కుటుంబ సభ్యులు, ఆయా పార్టీల నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఖర్చు చేస్తు న్నారు. ప్రత్యర్థి పార్టీలో ఉన్న ముఖ్య నేతలకు గాలం వేస్తున్నారు. అయితే ఇక్కడ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఇద్దరికీ గట్టిపోటీ ఇస్తున్నారు. రాష్ట్రంలో తమకు అనుకూలంగా ఉన్న స్థానాల్లో కామారెడ్డి ఒకటిగా భావిస్తున్న బీజేపీ నేతలు.. ఈ నియోజకవర్గంపై ఫోకస్ చేశారు. అందులో భాగంగా ప్రధాని మోదీ సభ ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. మోదీ సభతో మరింత బలం వస్తుందన్న నమ్మకంతో ఉన్న ఆ పార్టీ నేతలు భారీగా జనాన్ని సమీకరించడానికి కసరత్తు చేస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి డెబ్బై వేల మందిని, చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి మరో ముప్పైవేల మందిని తరలించడానికి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

మోదీ పర్యటనపై ఎన్నో ఆశలు..

ప్రధాని మోదీ కామారెడ్డికి వస్తుండడంతో ఆయన పర్యటనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే రైల్వే లైన్ డబ్లింగ్‌తో పాటు కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు నిధులు మంజూరయ్యాయి. అయితే కామారెడ్డి నుంచి సిరిసిల్ల, వేములవాడ మీదుగా కరీంనగర్‌కు, కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి, నిజాంసాగర్ మీదుగా బీదర్‌కు మరో రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. కామారెడ్డి పట్టణాన్ని రెండుగా విభజించే రైల్వేలైన్‌పై ఉన్న వంతెన ఇరుకుగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అశోక్‌నగర్‌లో రైల్వే గేటుతో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న వంతెనను విస్తరించడంతోపాటు అశోక్‌నగర్ గేటు స్థానంలో వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది. కామారెడ్డి ప్రాంతంలో మక్క, సోయా పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. ఇక్కడ ఆయా పంట ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పాలని ప్రజలు కోరుతున్నారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు, గోడౌన్‌లు నిర్మించాల్సిన అవసరముంది. కామారెడ్డి సభలో మోదీ ఎలాంటి హామీలిస్తారోనని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రంగంలోకి దిగిన కేంద్ర భద్రతా దళాలు...

కామారెడ్డికి ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో కేంద్ర భద్రతాదళాలు, ఎస్పీజీ బృందాలు గురువారం కామారెడ్డికి చేరుకున్నాయి. కేంద్ర నిఘా విభాగం అధికారులు పట్టణంపై నిఘా ఉంచారు. సభ జరిగే ప్రాంతానికి చుట్టుపక్కల ఉన్న ఇళ్లు, ఇతర ప్రదేశాలన్నింటినీ కేంద్ర బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ప్రధాని మోదీ హెలికాప్టర్ దిగే హెలీపాడ్ ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక వాడను పోలీసు బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఆర్మీకి చెందిన హెలికాప్టర్లు కామారెడ్డి పట్టణంలో చక్కర్లు కొడుతున్నాయి. సభా ప్రాంతం, హెలీపాడ్ ప్రాంతాల మీదుగా హెలీకాప్టర్లు పలుమార్లు తిరిగాయి. దీనిని పట్టణ ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

జిల్లాకు తొలిసారి..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి కామారెడ్డికి వస్తున్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. ప్రధాని ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఇందిరా గాంధీ స్టేడియానికి చేరుకుని, అక్కడి నుంచి సభా వేదిక వద్దకు వస్తారు. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు పలువురు రాష్ట్ర నేతలు పాల్గొనే అవకాశాలున్నాయి.

వాహనాల దారి మళ్లింపు..

కామారెడ్డి క్రైం: ప్రధానమంత్రి మోదీ పర్యటన నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. టేక్రియాల్ బైపాస్ నుంచి కామారెడ్డి కొత్త బస్టాండ్‌కు వెళ్లే వాహనాలతోపాటు అశోక్‌నగర్ క్రాసింగ్ గుండా బస్టాండ్‌వైపు వెళ్లే వాహనాలకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు అనుమతి లేదని ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఇతర ప్రాంతాలనుంచి పట్టణంలోకి రామారెడ్డి బ్రిడ్జ్, సిరిసిల్ల రోడ్ బ్రిడ్జ్‌ల ద్వారా రావచ్చని సూచించారు. హైదరాబాద్ –నిజామాబాద్ మార్గంలో తిరిగే ఆర్టీసీ, ఇతర వాహనాలు నర్సన్నపల్లి నుంచి బస్టాండ్‌కు వచ్చి తిరిగి నర్సన్నపల్లి ద్వారానే హైదరాబాద్ లేదా నిజామాబాద్‌కు వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. సభకు వచ్చే ప్రజలు వారి వాహనాలను స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్, గంజ్ మార్కెట్, వీక్లీ మార్కెట్‌లలో నిలిపి, అక్కడి నుంచి కాలినడకన సభా ప్రాంగణం వద్దకు రావాలని సూచించారు.

నాడు ఇందిరాగాంధీ..
నేడు నరేంద్రమోదీ

కామారెడ్డి నియోజకవర్గంలో 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ పాల్గొన్నారు. అప్పట్లో భారత జాతీయ కాంగ్రెస్ (ఐ) అభ్యర్థి బి.బాలయ్య తరఫున ఆమె ప్రచారం చేశారు. ఆ సందర్భంగా పట్టణంలోని సీఎస్ఐ గ్రౌండ్స్‌లో భారీ గద్దెను నిర్మించి వేదికను ఏర్పాటు చేశారు. ఆ వేదిక మీది నుంచి ఇందిరమ్మ ప్రసంగించారు. ఆ ఎన్నికల్లో బాలయ్య గెలిచారు. ఆ తర్వాత మరే ప్రధాని కామారెడ్డికి రాలేదు. ఇందిరా గాంధీ వచ్చివెళ్లిన నాలుగున్నర దశాబ్దాల తర్వాత మరో ప్రధాని మోదీ కామారెడ్డి పట్టణానికి వస్తున్నారు. ఇప్పుడు కూడా ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకే ప్రధానమంత్రి వస్తుండడం గమనార్హం.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు. సాధారణ పరిశీలకులు అర్ధుర్ వర్ఫ్యాయో, జగదీశ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలోని ప్రతి అంశంపై సూక్ష్మ పరిశీలకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు, తర్వాత ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ సమయంలో ఏజెంట్‌లు ఎంతమంది వచ్చారో సరిచూసుకోవాలని, తప్పనిసరిగా 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహించాలని సూచించారు. ఏజెంట్‌ల సలహాలు, సూచనలు నోట్ చేసుకొని సాధారణ పరిశీలకులకు తెలియజేయాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సీపీవో రాజారాం, నోడల్ అధికారి రఘునందన్, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్మూర్‌లో మొదటి ఏకగ్రీవ ఎన్నిక

- 1962లో కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల రంగారెడ్డి



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో 1962లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల రంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్‌కు చెందిన ఆయన మొదటిసారిగా ఎమ్మెల్యేగా పోటీకి నిలిచారు. అప్పట్లో రాజకీయాలపై పెద్దగా ఆసక్తి లేని కారణంగా ప్రత్యర్థులు ఎవరూ పోటీ చేయడానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం 1967, 1972 ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

ఖలీల్‌వాడి: ఎన్నికల్లో శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని సీపీ కల్మేశ్వర్ ఒ క ప్రకటనలో హెచ్చరించారు. ఈ నెల 28 సా యంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 4 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. దీని ప్రకారం.. ఐదుగురి కంటే ఎక్కువ మంది సమావేశాలు నిర్వహించొద్దు. ఊరేగింపులు, ప్రచారం నిషేధం. ఓటర్లను ప్రభావితం చేసేలా చర్యలు చేపట్టొద్దు. బహిరంగ ప్రదేశా ల్లో మద్యం, మత్తు పదార్థాలు వినియోగించొ ద్దు. మద్యం, కల్లు పంపిణీ చేయొద్దు. మత వి ద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం, చిత్రాలు చూపడం నేరం. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అంతరాయం కలిగించే ఏదైనా మండే, ఇతర పదార్థాలను తీసుకు వెళ్లడానికి వీలులేదు. పాటకులు పేల్చడం నిషేధించారు. పార్టీలకు అనుకూలంగా ఓటర్లతో ప్రమాణం చేయించకూడదు.

టోకెన్ పద్ధతిలో మద్యం విక్రయించొద్దు

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం దుకాణాల నిర్వాహకులు రాజకీయ పార్టీల అభ్యర్థులకు టోకెన్ విధానంలో మద్యం విక్రయిస్తున్నారని, ఇలా చేయడం నేరమని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రలోభాల పర్వానికి తెరలేచింది!

- ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థుల ముమ్మర యత్నాలు

మద్నూర్(జుక్కల్): ఎన్నికలు దగ్గరపడుతుండటంతో జుక్కల్ నియోజకవర్గంలో అభ్యర్థులు అంతర్గత ప్రచారాలకు తెరలేపారు. ప్రచారంలో భాగంగా ముందస్తు ఒప్పందాలతో ఎన్నికల్లో గట్టెక్కేందుకు బేరసారాలు కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో అధిక ఓటర్లు ఉన్న సామాజిక వర్గం మద్దతు కూడగట్టుకునేందుకు అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. కులాలు, యువకులు, విద్యావంతులు, మహిళా సంఘాల వారీగా ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గ్రామాల్లో ప్రాంతాల వారీగా లోలోపల సమావేశాలు ఏర్పాటు చేస్తూ తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థులు, పార్టీ నాయకులు కోరుతున్నారు. ఓటర్ల సంఖ్యకనుగుణంగా ఆఫర్లు ఇస్తూ నజరానాలు ప్రకటిస్తున్నారు. నగదు..మద్యంతో పాటు కానుకలను ఆశ చూపుతూ ఓట్లు దండుకునేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు తక్కువ సమయం ఉండటంతో ప్రత్యర్థి పార్టీ కన్నా ముందే తాము ఓటర్లను నయానో భయానో ఇచ్చి తమవైపు తిప్పుకోవడానికి జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 వరకు అభ్యర్థులు గెలుపు కోసం ఎత్తులు వేస్తున్నారు. స్నేహితులు, బంధువుల ద్వారా మద్దతు కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

‘చేతి’కి చిక్కుతున్న గులాబీ నేతలు!

- కాంగ్రెస్ గూటికి చేరిన జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇద్దరు కౌన్సిలర్లు
- అప్రమత్తమైన బీఆర్‌ఎస్ నాయకత్వం
- నేడు నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటన



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రిజ్వాన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: ఉద్దండులు పోటీ చేస్తుండడంతో కామారెడ్డి నియోజకవర్గ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇక్కడ సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో ఆయన ప్రత్యర్థిగా బరిలో దిగిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పావులు కదుపుతున్నారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి గట్టి పోటీ ఇస్తున్నా.. కాంగ్రెస్ నేతలు అధికార బీఆర్‌ఎస్‌పైనే ఫోకస్ చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా వాళ్ల బలాన్ని తగ్గించాలని, తద్వారా మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల దోమకొండ జెడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్‌ను పార్టీలో చేర్చుకున్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు రమేశ్, రవీందర్‌గౌడ్‌లూ హస్తం గూటికి చేరారు. తాజాగా శుక్రవారం భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి, అంబారిపేట ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

చక్రం తిప్పుతున్న రేవంత్ సోదరుడు...

కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో అధికార పార్టీలోకి వలసలు ఉంటాయని అంతా భావించారు. కానీ దానికి విరుద్ధంగా అదే పార్టీకి చెందిన నేతలు ప్రత్యర్థి పార్టీలోకి వెళ్తుండడం చర్చనీయాంశమైంది. ఈ విషయంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి చక్రం తిప్పుతున్నారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో నామినేషన్ వేసిన తరువాత ఇక్కడే అడ్డా వేసిన కొండల్‌రెడ్డి.. కాంగ్రెస్ నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాలు చేపడుతూనే, మరోవైపు ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకులకు వల వేస్తున్నారు. ప్రధానంగా పదవుల్లో కొనసాగుతున్న వారి మీద ఫోకస్ చేసి వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. రోజూ ఉదయమే ఆయన వాకర్స్‌ను కలిసి వారితో చిట్‌చాట్ చేస్తున్నారు. అలాగే గల్లీల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఒక వైపు గులాబీ పార్టీ నేతలపై దృష్టి పెడుతూనే, మరోవైపు ప్రచారాన్నీ కొనసాగిస్తున్నారు. ఆయనకు తోడుగా స్థానిక నాయకులు పనిచేస్తున్నారు. దీంతో ఇప్పటికే పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరగా.. మరికొందరు సైతం కండువా మార్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

నష్ట నివారణ చర్యలు..

కామారెడ్డి నియోజకవర్గంలో పలువురు గులాబీ నేతలు కారు దిగిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకత్వం అప్రమత్తమైంది. ఇంకా ఎవరైనా పార్టీని వీడే అవకాశం ఉందా అన్నదానిపై ఆరా తీస్తున్నారు. భిక్కనూరు ఎంపీపీ గాల్‌రెడ్డి పార్టీని వీడిన నేపథ్యంలో నష్టనివారణ చర్యలు చేపట్టినట్లు భావిస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రి కేటీఆర్ శనివారం కామారెడ్డి నియోజకవర్గంలో పర్యటించాలని నిర్ణయించారు. భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడనున్నారు. అలాగే జిల్లాకేంద్రంలో వ్యాపారులను కలిసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరనున్నారు. కాగా సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలంటూ మంత్రి కేటీఆర్ ఇప్పటికే పార్టీ నేతలు, కార్యకర్తలకు ఫోన్ ద్వారా సందేశం ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారితో ఓటు వేయించాలని కేటీఆర్ కార్యకర్తలకు సూచిస్తున్నారు. పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కేటీఆర్ బీఆర్‌ఎస్ శ్రేణులకు ఫోన్ ద్వారా సూచించనట్టు సమాచారం. ఇతర పార్టీల్లోకి వలసల నేపథ్యంలో బీఆర్‌ఎస్ సైతం వ్యూహాలకు పదును పెడుతోంది. తమ వారిని కాపాడుకోవడంతో పాటు ప్రత్యర్థి పార్టీకి చెందిన వారిని తమవైపు లాక్కునే ప్రయత్నాలూ మొదలుపెట్టినట్లు తెలిసింది.

కామారెడ్డిలో ఇరు పార్టీల బాహాబాహీ



మసీదు ఎదుట ముజీబొద్దీన్‌తో పాటు కార్యకర్తలు



కాంగ్రెస్ కార్యకర్తలు

- గంట పాటు ఉత్కంఠ వాతావరణం
- చెదరగొట్టిన పోలీసులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య శుక్రవారం బాహాబాహీ చోటు చేసుకుంది. పట్టణంలోని పాత బస్టాండ్‌వద్ద ఉన్న మసీదులో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు కార్యకర్తలు నమాజ్ చేసి కిందికి వచ్చారు. పెద్ద ఎత్తున పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో నమాజ్ ఎదుట ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు సైతం నినాదాలు చేశారు. దీంతో గంట పాటు మసీదు ఎదుట ఉత్కంఠ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ ప్రకాశ్, సీఐ నరేశ్ హుటాహుటిన చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో పాటు కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, కౌన్సిలర్ అన్వర్‌తో మాట్లాడారు. ఎన్నికల నిబంధనల మేరకు మసీదుల ఎదుట ప్రచారం, నినాదాలు చేయొద్దని హెచ్చరించారు. వారం క్రితం ఇదే మసీదు ఎదుట ముజీబొద్దీన్ ముందు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రతీకారంగా శుక్రవారం బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా నినాదాలు చేసినట్లు సమాచారం. కాగా ఈ గొడవలు జరుగుతున్న క్రమంలో మరో స్వతంత్ర అభ్యర్థి ఆరీఫ్ బాబా అక్కడే ప్రచారం చేస్తుండగా అతన్ని పోలీసులు హెచ్చరించి పంపించారు.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ కార్యకర్త!

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన చరణ్ అనే కాంగ్రెస్ కార్యకర్తను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వాసనీయంగా తెలిసింది. బాల్కొండ నియోజవకర్గ కాంగ్రెస్ నాయకుల వద్ద నుంచి డబ్బులకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ల ఫొటోలు చరణ్ వద్ద ఉన్నాయన్న సమాచారం మేరకు అతనిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. చరణ్ అరెస్టు విషయమై ఎస్సై వినయ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

అకారణంగా పోలీసుల దాడి

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన చరణ్‌పై పోలీసులు శుక్రవారం ఉదయం అకారణంగా దాడి చేసి నిర్బంధించారని బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌కుమార్ ఆరోపించారు. వేల్పూర్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన చరణ్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చరణ్ దగ్గర డబ్బులు ఉన్నాయన్న ఆరోపణతో ఇల్లు, కారు సోదా చేసి ఠాణాకు తీసుకు వచ్చారన్నారు. ఫోన్‌లో మెసేజ్ వచ్చిందన్న కారణం చూపుతూ దాడి చేశారని,



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న సునీల్‌కుమార్

ఒక్క రూపాయి కూడా దొరకక పోయినా నిర్బంధించారని ఆరోపించారు. అన్నం తినడానికి కూడా అనుమతించడం లేదన్నారు. బ్యాంకులో ఉన్న డబ్బుల గురించి ఆరాతీసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అధికారి పార్టీ అండతో పోలీసులు దౌర్జన్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి మేకలు, మద్యం పంచుతున్న పోలీసులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయడానికే పోలీసులు దాడులు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

పేదలను తాగుబోతులుగా మార్చారు



హాజరైన జనం

- మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావ్ చవాన్




లింగంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అశోక్ రావ్ చవాన్

లింగంపేట(ఎల్లారెడ్డి): తెలంగాణలో పదేళ్లుగా సీఎం కేసీఆర్ పేదలను తాగుబోతులుగా మార్చారని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావ్ చవాన్ విమర్శించారు. శుక్రవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌మోహన్‌రావుతో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రజలను మోసం చేశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను అమ్ముకుంటున్నాయని ఇరు పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో కారు పంక్చర్ అయిందని, ప్రస్తుతం పెట్రోలుకు డబ్బులు లేని స్థితికి దిగజారిందన్నారు. కాళేశ్వరంలో ప్రాజెక్టుతో లక్ష కోట్లు నీటిపాలు చేశారని ఆరోపించారు. తెలంగాణలో దళిత బంధు, బీసీ బంధు అంటూ ప్రజలను రోడ్డుపైకి తెచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు బీఆర్‌ఎస్ నాయకులు భయపడుతున్నారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటే అన్నారు. వారికి ఓటేసి మోసపోవద్దన్నారు. ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్‌మోహన్‌రావుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు ఇచ్చారు.

‘భూములిచ్చేది కాంగ్రెస్–అమ్ముకునేది బీఆర్‌ఎస్’

భూములిచ్చేది కాంగ్రెస్–అమ్ముకునేది బీఆర్‌ఎస్ పార్టీ అని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో రోడ్ షోలో మాట్లాడారు. అధికారంలోకి రాగానే ముందుగా పేదలకు ఇల్లు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళల ఖాతాల్లో ప్రతి నెలా 1న రూ.2500 అకౌంట్లలో వేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. నేతలు సంతోష్‌రెడ్డి, నారాగౌడ్, ఎల్లమయ్య, ఖదీర్, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జనాలతో కలిసి...



నిజామాబాద్‌నాగారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో బిజిబిజీగా గడుపుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్ నగరంలోని సవేరా హోటల్‌లో టీ తాగుతూ ఆమె అక్కడ ఉన్న జనాలతో ముచ్చటించారు. ఎమ్మెల్సీ కవితతో సెల్ఫీలు దిగడానికి చాలా మంది పోటీ పడ్డారు. అకస్మాత్తుగా కవిత తమ హోటల్‌ను సందర్శించడంపై యజమాని, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

డిచ్‌పల్లి: వరంగల్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే తెలంగాణ స్టేట్ లెవల్ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఖోఖో పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు శుక్రవారం బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్, ఆర్‌సీవో అలివేలు మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషన్, చిరంజీవి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.గంగాధర్, టీమ్ కోచ్, మేనేజర్ జ్యోత్స్న, మానస, సొప్పరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అధికారులు

సిద్ధాపూర్ నీటితో సస్యశ్యామలం చేస్తా

- బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్ రెడ్డి



హన్మాజీపేట్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి..



ముస్లింలతో కరచాలనం చేస్తూ..

బాన్సువాడ రూరల్: సిద్ధాపూర్ రిజర్వాయర్ నీటితో గట్టుమీది ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రూ.200 కోట్ల నిధులతో సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు కొనసాగుతున్నాయని, ఎన్నికల తర్వాత అక్కడే కుర్చీ వేసుకుని జూన్‌కల్లా పూర్తిచేసి సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఒక వేళ నన్ను పక్కన పెడితే మాత్రం రిజర్వాయర్ పనులు ఆగిపోతాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి కోట్లాది నిధులు మంజూరు చేయించానని, చేసిన అభివృద్ధి కండ్ల ముందే కనిపిస్తోందన్నారు. బాన్సువాడలో పోటీచేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు నియోజకవర్గం తోక ఎక్కడుందో, తొండం ఎక్కడుందో తెలియదని ఎద్దేవా చేశారు. వారి నియోజకవర్గాలలో అభివృద్ధి చేయకపోవడంతోనే అక్కడ ఓడించారని, ఇక్కడ కూడా ఓటుతో కర్రుకాల్చి వాతపెట్టాలని కోరారు. బోర్లం క్యాంపు, కోనాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాంనాయక్, పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్, రైతుబంధు జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక కృషి

బాన్సువాడ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో ముస్లింల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్ద మజీద్ వద్ద ముస్లింలను కలిసి మద్దతు తెలపాలని కోరారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు.

బాన్సువాడ అభివృద్ధి పోచారంతోనే సాధ్యం

బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు కాలనీల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

బీర్కూర్‌లో పలువురి చేరిక

బీర్కూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ యువకులు మాజీ జె ద్రోణవల్లి సతీష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నేతలు శశికాంత్, అవారి గంగారాం, దుంపల రాజు ఉన్నారు.

అభివృద్ధి కోసం కేసీఆర్‌ను గెలిపించాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత తన్నీరు మహేష్ రావు



దోమకొండ: కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, ఎన్నారై తన్నీరు మహేష్ రావు అన్నారు. శుక్రవారం దోమకొండలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కొట్లాడి సాధించిన తెలంగాణ మరింత అభివృద్ధి కోసం కేసీఆర్ ని గెలిపించాలని కోరారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల కంటే కూడా కామారెడ్డి మరింతగా అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ఎన్నారైలు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాళ్ల చందు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్ రావు నాయకులు నల్లపు శ్రీనివాస్, కానుగంటి నాగరాజు, తదితరులున్నారు.

నర్సింగ్‌పల్లిలో మధ్యాహ్న భోజనం బంద్

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పది రోజులుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు వ్యక్తిగత కారణాలతో నిలిపేశారు. దీంతో ఇంటి నుంచే విద్యార్థులు భోజనం తెచ్చుకుంటున్నారు. ఈవిషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లామని, త్వరగా కొత్త వారిని నియమించాలని ఆదేశించినట్లు హెచ్‌ఎం ఉష శ్రీ తెలిపారు. మూడు రోజుల్లో కొత్త వారిని నియమిస్తామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

తనిఖీల్లో నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ చెక్ పోస్ట్ వద్ద గురువారం అర్ధరాత్రి చేపట్టిన వాహనాల తనిఖీలో రూ. 6లక్షల5వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న డీసీఎం వాహనాన్ని తనిఖీ చేయగా నగదు లభ్యమైనట్లు పేర్కొన్నారు. వీటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద లారీ కారును శుక్రవారం ఢీకొన్నది. మామిడిపల్లి నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న లారీ దానికి ముందున్న కారు ఆకస్మాత్తుగా పక్కకు వెళ్లడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



నవీన్ మృతదేహం

కమ్మర్‌పల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్‌కు చెందిన జనార్దన్ నవీన్(36) బైక్‌పై మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కమ్మర్‌పల్లి శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నవీన్ తలకు, కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. నవీన్ సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

చింతకుంటలో నెమలి..



నెమలి కళేబరం

వర్ని(మోస్రా): మండలంలోని చింతకుంట వెళ్లే అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని నెమలి మృతి చెందినట్లు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నెమలి మృతి చెందినట్లు చెప్పారు. నెమలి కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేంజ్ ఆఫీసుకు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థినులను వేధించినందున దేహశుద్ధి

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని ఓ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఉపాధ్యాయుడిపై స్థానికులు, విద్యార్థినుల తల్లిదండ్రులు శుక్రవారం దేహశుద్ధి చేశారు. విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురిచేసేవాడని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై ప్రధానపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో ఆగ్రహం చెందిన తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయునికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

‘యువకులు ప్రలోభాలకు లొంగొద్దు’



మాట్లాడుతున్న అమృతారాజేందర్

కామారెడ్డి అర్బన్: యువకులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృత రాజేందర్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి ఆర్యభట్ట జూనియర్ కళాశాల ఇన్‌స్పైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఓటుహక్కు తమ తలరాతలను ఎలా మారుస్తుందనే విషయమై యువకులు, తమ కుటుంబసభ్యులకు చైతన్యం కల్పించాలని రాజేందర్ కోరారు. ప్రిన్సిపాల్ హన్మంతరావు, సంస్థ ప్రతినిధులు రవళి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మార్దండలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖాధికారులు

పిట్లం(జుక్కల్): మార్దండ గ్రామంలో శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఐకేపీ సీసీ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి భీంరావు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.